నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓయూ ప్రొఫెసర్స్ కాలనీ, మాధవిహిల్స్, గోల్డెన్ తులీప్ రోడ్ నెంబర్ 1,2,3,4,5, వెంకటరమణ టాటా మోటార్స్ లేన్, రాఘవేంద్ర కాలనీ హైటెన్షన్ లేన్, జేవీజీహిల్స్, శిల్పావ్యాలీ,సెంట్రల్‌పార్క్ ఫేజ్-2, కాంతివనం తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వైట్ ఫీల్డ్ పరిధిలో....

- గురువారం మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు మసీద్‌బండ, క్యామ్లెట్ లేఅవుట్, సీఎంసీ లేఅవుట్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

చందానగర్ : హఫీజ్‌పేట్ సెక్షన్ పరిధిలోని మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 4.00 వరకు నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనా రెడ్డి పేర్కొన్నారు.

- శ్రీలా ఫీడర్ పరిధిలోని శ్రీలా విల్లాస్, వాటర్ వర్క్స్, ఎస్ఎంఆర్ అపార్ట్‌మెంట్స్, కల్వరి చర్చ్ ఏరియాలలో ..

వేమనకాలనీ సెక్షన్‌లో...

- వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో.. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు
- భవానీపురం ఫీడర్ పరిధిలో.. రాజేందర్‌రెడ్డి కాలనీ, అమీన్‌పూర్ మెయిన్ రోడ్డు, పద్మజ కాలనీ ఏరియాలలో..
- సురక్షా ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. విద్యానగర్, సురక్షా ఎన్‌క్లేవ్, రాజేందర్‌రెడ్డి నగర్, సత్య ఎన్‌క్లేవ్, శుభోదయ కాలనీ, అపర్ణ హెటీ సర్వీస్ ప్రాంతాలలో ..
- ఎస్టీపీ ప్లాంట్ ఫీడర్ పరిధిలో.. ఎస్టీపీ ప్లాంట్, భవానీపురం, రెడ్డి కాలనీ, వీకర్ సెక్షన్, శంకర్‌నగర్ ప్రాంతాలలో..
- భిక్షపతి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. భిక్షపతి ఎన్‌క్లేవ్, జవహర్ కాలనీ రోడ్డు 4,5,6, కైలాష్‌నగర్, శ్రీదేవి థియేటర్ దగ్గర, ఎస్వీఎస్ ఇన్ఫ్రా లిమిటెడ్ ఏరియాలలో విద్యుత్ ఉండదు.

నేడు మనూలో జాతీయ సదస్సు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10.30 గంటలకు జాతీయ సదస్సు నిర్వహిస్తామని ఆ విభాగం హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్ తెలిపారు. వికసిత్ భారత్– ఎస్‌డీజీల సందర్భంగా సమకాలీన వ్యాపార పద్ధతులపై రెండు రోజుల జాతీయ సదస్సులో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ శ్రీనివాసమూర్తి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ మాజీ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖుద్దూస్, వీసీ ఐనుల్ హసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ పాల్గొంటారని చెప్పారు.

నివాళి



చందానగర్: చందానగర్ సర్కిల్ 21లో యూసీడీ విభాగంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న తీగల శ్రీహరి బుధవారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందాడు. సర్కిల్ కార్యాలయంలో అతని చిత్రపటానికి డీసీ మోహన్‌రెడ్డి, పీఓ ఉషారాణి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు.

ప్రత్యేక పూజలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ, ధ్వజ స్తంభాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

20 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 20 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా ఒక్కొక్కరికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చందానగర్ : ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. బుధవారం విజేత సూపర్ మార్కెట్ శ్రీదేవి థియేటర్ సమీపంలో ఓ వృద్ధుడు (45) అనారోగ్యంతో కిందపడిపోయి ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం





చందానగర్ నారాయణ కళాశాల వద్ద విద్యార్థులు



మదీనాగూడలోని చైతన్యభారతి కళాశాల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు



మియాపూర్ మదీనాగూడలోని చైతన్య కళాశాలలో..



మదీనాగూడలోని కళ్యం అంజిరెడ్డి కళాశాలలో..

ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు అరగంట ముందే చేరుకున్నారు. ప్రశాంతంగా పరీక్షలు రాశారని అధికారులు తెలిపారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో మొత్తం 29 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పది, మియాపూర్‌లో 13, చందానగర్‌లో 5, రాయదుర్గంలో 1 కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. –శేరిలింగంపల్లి జోన్ బృందం



లింగంపల్లి జెడ్పీహెచ్ఎస్ వద్ద వేచి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

వైభవంగా శ్రీవారి రథోత్సవం



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో స్వామివారి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి రథోత్సవాన్ని కనులారా చూస్తే జన్మరాహిత్యం కలుగుతుందని శాస్త్రం చెబుతుందని అర్చకులు తెలిపారు. నగర నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి రథాన్ని లాగేందుకు పోటీ పడ్డారు. సాయంత్రం స్వామివారు అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.

75 శాతం మంది మహిళలకు వెన్నెముక సమస్య



సమస్యలపై చర్చిస్తున్న వివిధ రంగాలకు చెందిన మహిళలు

హర్ హెల్తీ స్పైన్ అవగాహన కార్యక్రమం

గచ్చిబౌలి: ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం వల్లనే మహిళలకు వెన్నెముక సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. బుధవారం పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఎన్‌స్యూర్ హెల్తీ స్పైన్-సీఎస్ఎస్‌హెచ్ ఆధ్వర్యంలో ' హర్ హెల్తీ స్పైన్' పేరిట అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్చ్యూన్ కంపెనీ మాజీ సీనియర్ ఎగ్జిక్యూటివ్, ఈక్విటీ ఇన్వెస్టర్ చైర్‌పర్సన్ కిరణ్మయి పెండ్యాల మాట్లాడుతూ గర్భధారణ, ప్రసవం తర్వాత హార్మోన్ల మార్పులతో వెన్నెముక సమస్యలు వస్తున్నాయని అన్నారు. ఐక్యాచ్ కమ్యూనికేషన్ ఇండియా లిమిటెడ్ ఎండీ సంగీతారాణి గుమ్మి మాట్లాడుతూ మహిళలు రోజంతా పని చేసి ఒత్తిడికి లోనవడంతో వెన్నెముక సమస్యలు తప్పడం లేదన్నారు. వెన్నెముక సమస్యలపై మహిళలకు అవగాహన అవసరమన్నారు. ఎన్‌ష్యూర్ హెల్తీ స్పైన్, సీఎస్ఎస్‌హెచ్ సీఈఓ నరేష్‌కుమార్ మాట్లాడుతూ సెంటర్ ఫర్ స్పైన్ అండ్ స్పోర్ట్స్ హెల్త్ మూడు వేల మంది మహిళలను పరీక్షించగా 75 శాతం మంది వెన్నెముక సమస్యతో బాధపడుతున్నట్లు తేలిందన్నారు. కార్యక్రమంలో హెల్త్‌కేర్ అండ్ లైఫ్ సైన్సెస్ ఎర్లీ స్టేజ్ ఇన్వెస్టర్ వేదా సంపత్, ఆర్‌బీసీహెచ్ హెడ్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ సుష్మిత సుందర్, ఆసియా ట్రాక్ ఫీల్డ్ మెడలిస్ట్, కోచ్ మృదుల కోరాడ, ఇన్ఫోసిస్ టెక్నాలజీ లీడర్ స్వప్న ఆరెల్లి తదితరులు పాల్గొన్నారు.

చెత్తకు నిప్పంటుకుని..

రైల్వే ట్రాక్ వెంబడి మంటలు



పాపిరెడ్డికాలనీలో మంటలు ఆర్పుతున్న దృశ్యం

శేరిలింగంపల్లి: చెత్తకు నిప్పంటుకుని మంటలు రేగగా ఫైరింజన్‌తో ఆర్పివేశారు. శేరిలింగంపల్లిలోని పాపిరెడ్డికాలనీలోని రైల్వే ట్రాక్ పక్కన ఉన్న చెత్తలో బుధవారం అకస్మాత్తుగా మంటలు చేలరేగాయి. వెంటనే ఫైరింజన్‌కు ఫోన్ చేయడంతో వారు వెంటనే అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. దీంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

డీఐజీ సన్నీకి ఘనంగా వీడ్కోలు



డీఐజీ సన్నీ వాహనాన్ని లాగుతున్న కొండాపూర్ బెటాలియన్ అధికారులు, సిబ్బంది

గచ్చిబౌలి: టీజీఎస్‌ఎస్‌పీ కొండాపూర్ 8వ బెటాలియన్ కమాండెంట్‌గా పని చేసి డీఐజీగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లిన సీ.సన్నీకి బుధవారం వీడ్కోలు పలికారు. కొండాపూర్ బెటాలియన్‌లో కమాండెంట్ రామకృష్ణ సమక్షంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. గౌరవ సూచకంగా డీఐజీ సన్నీ వాహనాన్ని అధికారులు, సిబ్బంది ప్రధాన ద్వారం వరకు లాగి ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ బీవీరెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్లు సీతారాం, నాగభూషణం, పార్థసారథి, రెహమాన్, సిబ్బంది పాల్గొన్నారు.

మరిన్ని లింక్ రోడ్లు ఏర్పాటు చేయాలి

జీహెచ్ఎంసీ చీఫ్ సిటీప్లానర్‌కు ఎమ్మెల్యే గాంధీ వినతి



జీహెచ్ఎంసీ కార్యాలయంలో సీసీపీ శ్రీనివాస్‌తో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్లు, లింకురోడ్లు నిర్మాణం, అసంపూర్తి పనులు పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌కు బుధవారం ఎమ్మెల్యే గాంధీ వినతిపత్రాన్ని అందించారు.జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంలో ఆయనను మియాపూర్ కార్పొరేటర్ శ్రీకాంత్‌తో కలిశారు. ముఖ్యంగా శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణ, జేఎన్‌టీయూ– ప్రగతినగర్ వరకు రోడ్డు విస్తరణ, ఫ్లైఓవర్ నిర్మాణం, అపర్ణాహిల్‌పార్కు నుంచి గంగారం చెరువువద్ద హనుమాన్ దేవాలయం వద్ద జాతీయ రహదారిని కలిపే లింకురోడ్డు పనులు, హెచ్ఎంటీ స్వర్ణపురి నుంచి పీజేఆర్ ఎన్‌క్లేవ్ వరకు లింకురోడ్డు, పనులను చేపట్టాలని కోరారు. సీసీపీ శ్రీనివాస్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

జీహెచ్ఎంసీ సీఈ భాస్కర్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే

జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సీఈ భాస్కర్‌రెడ్డిని ఎమ్మెల్యే గాంధీ కలిశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని రోడ్లు, లింకురోడ్ల నిర్మాణం, నాలాల విస్తరణ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. గంగారం చెరువు అలుగు నుంచి శంకర్‌నగర్ వరకు నాలా విస్తరణ, భక్షికుంట చెరువు అలుగు నుంచి భవానీపురం నాలా పనులు చేపట్టాలని కోరారు. ఖాజాగూడ పెద్ద చెరువు నుంచి ఎల్లమ్మచెరువు వరకు వయా సాయివైభవ్ కాలనీ నాలా విస్తరణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని కోరారు. శేరిలింగంపల్లిలో రోజురోజుకూ వాహనాల రాకపోకలు పెరిగిపోతున్నందున రోడ్ల విస్తరణ, లింకు రోడ్లు ఏర్పాటు చేయాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు చేయాలని కోరారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

మెగా ఎంఎస్ఎంఈ క్యాంపులో రుణాల అందజేత

శంషాబాద్ రూరల్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన ఎంఎస్ఎంఈ ఔట్‌రీచ్ క్యాంపులతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహంతో పాటు మేక్ ఇన్ ఇండియాకు నూతన శక్తిని ఇస్తుందని జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ఎం.శ్రీలక్ష్మీ అన్నారు. బ్యాంకు సైఫాబాద్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో మండలంలోని ముచ్చింతల్‌లో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో బుధవారం మెగా ఎంఎస్ఎంఈ ఔట్‌రీచ్ క్యాంపు నిర్వహించారు. ఎంఎస్ఎంఈ ఉత్పాదనలపై బ్యాంకు ఖాతాదారులకు అవగాహన కల్పించారు. సుమారు రూ. వంద కోట్లకు సంబంధించిన రుణ మంజూరు పత్రాలను 50 మంది ఖాతాదారులకు అందజేశారు. వివిధ రకాల ఉత్పత్తుల తయారీ రంగంలో 45 శాతం వాటాతో పాటు దేశంలో 65 శాతంపైగా యువతకు జీవనోపాధి కల్పిస్తుందన్నారు. ఇలాంటి మెగా క్యాంపులను దేశంలోని 157 కేంద్రాల్లో మార్చి 3 నుంచి 7 వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు హైదరాబాద్ జనరల్ మేనేజర్ ఆర్.ఎల్.పట్నాయక్, డీజీఎం సోనాలిక, ఏజీఎంలు రవి, జగదీశ్, లేపాక్షి తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్రలో కొని.. శ్రీనగర్‌కాలనీలో విక్రయం

- ఐదుగురు గంజాయి విక్రేతల అరెస్టు
- రెండు కిలోల గంజాయి స్వాధీనం

బంజారాహిల్స్: మహారాష్ట్రలో గంజాయి కొనుగోలు చేసి, నగరంలో విక్రయిస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. శ్రీనగర్‌కాలనీలోని నవోదయకాలనీ గణపతి కాంప్లెక్స్ వద్ద కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందడంతో జూబ్లీహిల్స్ పోలీసులు ఓ ఫ్లాట్‌పై దాడి చేసి ఐదుగురు గంజాయి విక్రేతలు, ముగ్గురు కొనుగోలుదారులను అరెస్టు చేశారు. నవోదయకాలనీ గణపతి కాంప్లెక్స్ ఫ్లాట్‌నెంబర్ 201లో గాదె సాయి తేజశ్వర్‌రెడ్డి అనే విద్యార్థితో పాటు జీహెచ్ఎంసీ అసిస్టెంట్ సూపర్‌వైజర్ మద్దునూరి శివాజీ, సాయికృష్ణ సదన్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న విద్యార్థి గార్లపాటి హేమవంశీ, ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన పాలకుర్తి శ్రీకాంత్, ఎస్సార్‌నగర్‌లోని హాస్టల్‌లో ఉంటున్న కాగితపల్లి హేమసుందర నాగరాజులను అరెస్టు చేసి వారి నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు మహారాష్ట్రలోని పర్లి రాజేంద్రనగర్ చౌక్‌లో అంజద్ అనే ప్రధాన గంజాయి విక్రేత నుంచి రెండు కిలోల గంజాయి తీసుకువచ్చి నగరంలో అవసరమైన వారికి విక్రయిస్తున్నట్లు తెలిపారు.ఫిలింనగర్‌కు చెందిన జహంగీర్, కృష్ణానగర్‌లో ఉంటున్న కుంచాల ఉదయ్ వెంకట్, యాదగిరినగర్‌కు చెందిన దోమ రాకేష్ గంజాయి సేవిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరందరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రక్తదానం ప్రాణదానమే



మణికొండ: ప్రమాదాల బారిన పడిన వారికి రక్తం లభించక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, అలాంటి వారిని ఆదుకునేందుకు ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ జూబ్లీహిల్స్ వారి సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయటం వలన రక్తం ఉత్పత్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు విజయలక్ష్మి, అరుణ, అధ్యాపకులు డాక్టర్ ఎం.రవిచందర్, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

విశిష్టతను సంతరించుకున్న కుంభమేళా

ప్రముఖ వక్త, రచయిత్రి అంజు పొద్దార్



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రచయిత్రి అంజు పొద్దార్ తదితరులు

చందానగర్ : మహా కుంభమేళా శాస్త్రీయంగా, ఆధ్యాత్మికంగా విశిష్టత కలిగి ఉందని ప్రముఖ వక్త, రచయిత్రి అంజు పొద్దార్ అన్నారు. బుధవారం గంగారంలోని మహిళా దక్షిత సమితి విద్యా సంస్థలో కుంభమేళాపై ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ ఉపన్యాస కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ వక్త, రచయిత్రి అంజు పొద్దార్, హిందీ ఆర్ట్స్ కళాశాల అధ్యక్షులు శీల్ కుమార్ జైన్, రోగిసహాయత ట్రస్ట్ ట్రస్టీ విమల భద్రుక, మహిళ దక్షిత సమితి విద్యా సంస్థల అధ్యక్షురాలు డాక్టర్ సరోజ బజాజ్‌లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రుడు ఒకే రాశిలోకి రావడంతో కుంభమేళా విశిష్టత సంతరించుకుందన్నారు.మహిళ దక్షిత సమితి విద్యా సంస్థలలో చదువుకునే విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలన్నాను. కార్యక్రమంలో శారద గుప్త, మున్న జెగెట్వా, అనురాధ, జయ బహేటి, సుశీల, డాక్టర్ అనిత, మహిళ దక్షిత సమితి విద్యా సంస్థల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

శంషాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని వైఎన్నార్ గార్డెన్‌లో సిరి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అనేక రంగాల్లో మహిళలు అద్భుతంగా రాణిస్తున్నారన్నారు. మహిళల పట్ల అక్కడక్కడ జరుగుతున్న సంఘటనలు బాధాకరంగా ఉంటున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సుష్మ, మాజీ వైఎస్ చైర్మన్ బండిగోపాల్, మాజీ సర్పంచ్ ఆర్.గణేష్‌గుప్తా, మాజీ నార్సింగి ఏఎంసీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్, సిరి సంస్థ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్



శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద ట్రాఫిక్‌జామ్‌తో వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. అండర్‌బ్రిడ్జి వద్ద బాక్స్‌టైప్ డ్రైన్ పనులు జరుగుతుండడం, ఇంటర్మీడియట్ పరీక్షలు ఆరంభం కావడంతో వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో ట్రాఫిక్‌జామ్ నెలకొంది. లింగంపల్లి నుంచి గచ్చిబౌలి వైపునకు వాహనాలు రావడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో కొద్దిసేపు వాహనదారులు, పాదచారులు ఇక్కట్లు పడ్డారు. శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రానికి విద్యార్థులతో తల్లిదండ్రులు కూడా రావడంతో ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించింది. లింగంపల్లి అండర్‌బ్రిడ్జి వద్ద ఆర్‌ఓబీ నిర్మిస్తేనే ట్రాఫిక్ సమస్య తీరుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.





లింగంపల్లి అండర్‌బ్రిడ్జి వద్ద ట్రాఫిక్

తాళం వేసిన ఇళ్లే టార్గెట్.. పట్టపగలు చోరీలు

జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు

- 57.5 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
- నిందితుడి అరెస్ట్, రిమాండ్



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఐ రమేష్ నాయుడు



స్వాధీనం చేసుకున్న బంగారు నగలు

మియాపూర్: జైలుకు వెళ్లి వచ్చాక కూడా తన ప్రవర్తన మార్చుకోకుండా జల్సాలకు అలవాటు పడి పట్టపగలు తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మియాపూర్ డీఐ రమేష్ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా కాశీబుగ్గ వివేకానంద కాలనీకి చెందిన నాగెల్లి హేమంత్ సాయి(23) మేడ్చల్ జవహర్ నగర్ కళ్యాణిదేవి కాలనీలో నివాసముంటున్నాడు. జల్సాలకు అలవాటుపడి గత కొంతకాలంగా దొంగతనాలకు పాల్పడుతూ.. ఆ డబ్బులతో జల్సాలు చేస్తుండేవాడు. కాగా మియాపూర్ మాధవనగర్ కాలనీలో నాన్సీ, ఆదినారాయణ దంపతులు నివాసముంటున్నారు. నాన్సీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. గత నెల 20వ తేదీ రోజు మాదిరిగానే స్కూల్‌కు వెళ్లింది.భర్త ఆదినారాయణ పనిపై వేరే ఊరికి వెళ్లాడు. ఇంట్లో ఉన్న కుమారుడు ధీరేందర్ 11 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి ఉద్యోగానికి వెళ్లాడు. తర్వాత మధ్యాహ్న సమయంలో ఇంటికి పార్సిల్ వచ్చిందని భర్త ఆదినారాయణ భార్య నాన్సీకి ఫోన్ చేయగా ఆమె పార్సిల్ తీసుకోమని అద్దెదారులకు తెలిపింది. వారు వచ్చిచూడగా ఇల్లుతాళం పగులగొట్టి ఉండడం గమనించి నాన్సీకి తెలిపారు. వెంటనే వారు ఇంటికి వచ్చి బీరువా తీసి చూడగా బంగారు ఆభరణాలు, నగదు లేకపోవడం చూసి వెంటనే ఆమె మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. సీసీఎస్ పోలీసులు, మియాపూర్ పోలీసుల సంయుక్త దర్యాప్తులో నాగెల్లి హేమంత్ సాయిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. అతని వద్దనుండి 57.5 గ్రాముల బంగారు ఆభరణాలను మియాపూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చిలకలగూడ, బషీరాబాద్, అల్వాల్ పోలీస్ స్టేషన్‌లలో హేమంత్ సాయిపై 8 కేసులు నమోదై ఉన్నాయని, గతంలో జైలుకు వెళ్లి వచ్చాడని తెలిపారు. ఈ మేరకు హేమంత్ సాయిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.